# మనిషి-చిత్రం

భానుమూర్తికి పిచ్చిపట్టిందన్న వార్త వింటూ.... నేనూ కొద్దిక్షణాలు పిచ్చివాడిలా ..... ఉండిపోయాను.

సాయంత్రంస్కూలు నించి ఇంటికి వచ్చి కుర్చీలో కూర్చుని ఇంటావిడ ఇచ్చిన టీ త్రాగుతున్నాను. " ఏ వండీ ! పాపం భానుమూర్తి అన్నయ్యగారికి పిచ్చి పట్టిందట. ఎదుట మనుషుల్ని ఎవర్నీ గుర్తించడం లేదట. భయంగా, గావుకేకలు పెడుతున్నారట... ప్రొద్దుట, పక్కింటి పిన్నిగారు, హాస్పిటల్లోకెళ్ళారా చూశార్ట..." ఆవిడ సానుభూతికురిపిస్తూ ఇంకా ఏదో చెప్పుకు పోతోంది.

" ఏ హాస్పిటల్లో .....?' టీ కప్పు కిందపెట్టి చటుక్కున లేచాను. " విజయా నర్సింగ్‌హోమ్‌లో .." కళ్ళజోడు సర్దుకున్నాను. కాళ్ళు చెప్పుల్లో దూర్చాను.

" ఒక సారి చూసి వస్తాను... తలుపేసుకో ... !" గబగబాగుమ్మందాటి వీధిలో పడ్డాను. విజయా నర్సింగ్‌హోమ్, మా ఇంటికి దగ్గరే ... ! భానుమూర్తికి పిచ్చిపట్టడమేమిటి....? అసలు పిచ్చి పట్టడమంటే ? మానసిక స్థిరత్వాన్ని, స్థైర్యాన్ని కోల్పోవడమా ... ? అలాంటి స్థితి భానుమూర్తికి ఎందుకొచ్చింది...? నాకు తెలిసినంతవరకు వాడికి ఆర్థికంగా ఏ సమస్యలూ లేవు... మనసును పట్టి పీడించే బాధలు లేవు. పిచ్చి పట్టేటంత మానసిక హింస వాడు ఎప్పుడూ అనుభవించిన దాఖలాలు లేవు.

ఆలోచనగా వీధిచివరకు వచ్చాను. రోడ్డెక్కి వారగా నడుస్తున్నాను. భానుమూర్తికి అందమైన భార్య ఉంది. ఆ భార్యకు బ్యాంకులో ఉద్యోగం కూడా ఉంది. ఆవిడ పేరు వసుంధర. ఇద్దరి ఉద్యోగాల సంపాదనతో రెండేళ్ళ క్రితం, ముచ్చటగా విశాలమైన ఇల్లు కట్టుకున్నారు.

బంధువుల్ని, స్నేహితుల్ని ఆడంబరంగా పిలుచుకొని గొప్పగా గృహప్రవేశం చేశారు. భానుమూర్తి స్వతహాగా తెలివైనవాడే అయినా వసుంధర అతను చేసే ప్రతి పనికి - వెనుక నిలబడుతుంది. సలహాలనిస్తుంది.

భానుమూర్తి నా చిన్ననాటి స్నేహితుడు దూరపు బంధుత్వం కూడా ఉంది. ఒకే ఊరివాళ్ళం... కలిసి చదువుకున్న వాళ్ళం... హైస్కూలు చదువు ఆపి పరీక్షలు కట్టి శిక్షణ పొంది... చిత్రలేఖనం నేర్పే ఉపాధ్యాయుడుగానే నేను స్థిరపడితే... పి.యు.సి. చదివి, డిగ్రీ పూర్తిచేసి ఒక ప్రభుత్వ రంగ సంస్థలో సునాయాసంగా ఉద్యోగం సంపాదించాడు వాడు. అనతికాలంలోనే ఆఫీసరయ్యాడు. మరికొంత కాలానికి ఎం.డి. స్థాయికి ఎదిగిపోయాడు. వాడు నాకంటే అన్నివిధాలా అదృష్టవంతుడని అవకాశాలు, వాడ్ని అంచెలంచెలుగా నిచ్చెనెక్కించాయని, నేను అసూయపడ్డ క్షణాలు లేకపోలేదు. బదిలీల కాలక్రమణంలో,

ఒకే ఊళ్ళో ఉద్యోగాలు స్థిరపడటంతో.. మా మధ్య చిన్ననాటి స్నేహానుబంధం మరింత చిక్కబడింది. నేను వాడి సొంత ఇంటికి వెళ్ళడం, వాడు మా అద్దె ఇంటికి రావడం, కుటుంబ విషయాలు కలబోసుకోవడం... ఆర్థికంగా, సామాజికంగా మా ఇద్దరి మధ్య ఎంతో అంతరం ఉన్నా... మా స్నేహం కొనసాగుతూనే ఉంది.

"కీ.... ఈ... ఈ" ఏదో వాహనం గ్యాస్ హారను.. శబ్ద కాలుష్యంతో శ్రవణేంద్రియాలు చిట్లినట్లయి... ఆలోచన్ల నుంచి తెప్పరిల్లి చూస్తే ఎదురుగా విజయా నర్సింగ్‌హోమ్!

హాల్లో విచారణ చేశాను. మూడవ అంతస్తులో 36వ గదిలోకి మూడే మూడు నిమిషాల్లో చేరి, తడబడే అడుగులతో లోపలికి నడిచాను.

భానుమూర్తి పరుపు మీద ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు. వాడికిరువైపులా ఇద్దరు డాక్టర్లు... వాడి శరీరంలోకి సన్నటి ట్యూబులోంచి, సూది ద్వారా సెలైను, చుక్కలు చుక్కలుగా ఇంకుతోంది. గదిలో ఒక మూల వాడి భార్యాపిల్లలు. వాళ్ళ ముఖాల నిండా దిగులు వేళ్ళాడుతూంది. వసుంధర, నా వైపు చూసి దుఃఖంతో కళ్ళు ఒత్తుకుంది.

భానుమూర్తి కొడుకు కిరణ్‌ని తీసుకుని బయటికి నడిచాను.

"అసలేం జరిగింది?" వరండాలో నిలబడి ఆత్రంగా అడిగాను.

"అదే... తెలియదు అంకుల్, నిన్న సాయంత్రం నాలుగున్నరకి విజయవాడ నుంచి ఫోనొచ్చింది. ఆఫీసులో డాడీ పిచ్చిగా అరిచారని... స్పృహ తప్పి పడిపోయారని... ఏవో మాటలు కలవరించారనీను.... మేము చాలా భయపడ్డాం. రాత్రి తొమ్మిది గంటలకి టాక్సీలో ముగ్గురు మనుషులు ఆఫీసువాళ్ళే డాడీని మాకు అప్పగించి వెళ్ళిపోయారు... టాక్సీలో కూడా చాలాసార్లు అరిచారట... వెంటనే హాస్పిటల్లో చేర్పించాం!" కిరణ్ గొంతు వణుకుతోంది. నాకంతా ఆశ్చర్యంగా ఉంది. అయోమయంగా ఉంది. అర్థం గాకుండా ఉంది...

కిరణ్-బుద్ధిమంతుడు, వినయవిధేయతలున్న వాడు. మొన్ననే ఇంజనీరింగు పూర్తిచేశాడు. తల్లిదండ్రుల్ని ఎదిరించాడన్నమాట ఎన్నడూ వినలేదు. ఆడపిల్లలిద్దరిలో శిరీష బియెస్సీ బయో టెక్నాలజీ చదువుతూంది. చిన్నపిల్ల శైలజ ఇంటర్‌లోకి వచ్చింది. ఇద్దరూ చదువులో సరస్వతులే.... పిల్లల వల్ల ఏ సమస్యలు లేవు. భార్య వసుంధర, కారణంగా ఏ రకంగానూ మనస్తాపం కలిగే అవకాశమూ లేదు. ఎలా ఆలోచించినా, ప్రస్తుత భానుమూర్తి పరిస్థితికి హేతువు అంతుపట్టడం లేదు.

గదిలోంచి డాక్టర్లు బయటికి వచ్చారు. మేము తిరిగి లోపలకు వెళ్ళాం. భానుమూర్తికి మెలకువ వచ్చిన తరువాత, ఇంకా ఏవో పరీక్షలు చేస్తే గాని పరిస్థితి అంచనా వేయడం సాధ్యపడదట..... వసుంధరలో తిరిగి దుఃఖపు తెర ఎగిసి పడింది. నేను ధైర్యపు వచనాలు పలికాను... !

"రాత్రి రెండు, ఉదయం, రెండు, మధ్యాహ్నం రెండు మత్తు ఇంజక్షన్లేవో... వరుసబెట్టి

చేశారంకుల్! డాడీకి మెలకువ ఎప్పుడొస్తుందో... ఏమో... ? పెద్ద పిల్ల శిరీష బెంగగా అంది. ఆమాట అన్న అరగంటకు భానుమూర్తికి మెలకువ వచ్చింది. దాదాపు ఏడుస్తూ 'డాడీ' అన్నారు పిల్లలు. "ఏవండీ!" అంటూ వసుంధర ఏడవబోయింది. " ఒరేయ్! నేస్రా సత్యాన్ని" అంటూ పలకరించి వాడి ముఖంలోకి చూశాను. భానుమూర్తి ఎవరికీ బదులు చెప్పలేదు... ఎవర్నీ గుర్తించినట్టు లేదు. అదో రకం చూపు... అర్థం లేని చూపు... అందర్నీ కాస్సేపు చూసి అలసటగా కళ్ళు మూసుకున్నాడు. అంతలోనే కెవ్వుమని అరిచాడు. అందరిలోనూ, ఆవేదన పెల్లుబుకింది. నర్సు వచ్చి ఇంజక్షనిచ్చింది. నేనక్కడ రెండు గంటలు గడిపి ఇంటికి బయలుదేరాను. భానుమూర్తి పరిస్థితి నన్ను కలవరపెడుతోంది.

అయిదు రోజుల తరువాత, వసుంధర తన భర్తను విజయా నర్సింగ్ హోమ్ నుంచి ఇంటికి తీసుకువచ్చింది. భానుమూర్తి పరిస్థితిలో మార్పులేదు. ఆ పిచ్చి చూపులు, అరవడం, తగ్గలేదు. ఇంటి వద్దే మరో మానసిక వైద్యుడి ఆధ్వర్యంలో వాడికి వైద్యం జరుగుతోంది. వసుంధర, వాడ్ని కంటికి రెప్పలా చూసుకుంటోంది. భానుమూర్తిని పరామర్శించడానికి, బంధువులు, స్నేహితులు ప్రవాహంలా వచ్చి పోతున్నారు. నేను రోజూ వెళ్ళి పరిస్థితిని గమనిస్తున్నాను.

ఆరోజు ఆదివారం... ఉదయం పదకొండు గంటలు ! నేనూ వసుంధర, భానుమూర్తి మంచం వద్ద కూర్చున్నాం. వాడు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. విజయవాడ నుండి ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. చూడటానికి పెద్ద మనుషులుగానే ఉన్నారు. భానుమూర్తి ఆఫీసులో సహకార సంఘం కాంట్రాక్టర్లుగా తమను తాము పరిచయం చేసుకున్నారు. వసుంధర వాళ్ళకు మర్యాదలు చేసింది. భానుమూర్తి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదో ప్రాజెక్టుకు వర్క్ ఇప్పిస్తానని, భానుమూర్తి వాళ్ళ వద్దరెండు లక్షల రూపాయలు తీసుకున్నాడట. ఫైలు మీద సంతకం పెట్టలేదట. ఈలోగా వాళ్ళ సి.ఎం.డి., ఆ ప్రాజెక్టు పని మరొకరికి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడట. .భానుమూర్తి ఆ డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడట. ఇప్పుడా రెండు లక్షల రూపాయలు తక్షణం ఇవ్వాలట... ఇవ్వక పోతేఎంత గొడవకైనా సంసిద్ధపడి వచ్చారట... వాళ్ళు చెప్పిన విషయం విని, నాకు మెదడు మొద్దుబారి నట్టయింది. వసుంధర నిర్విణ్ణురాలైంది. కొంతసేపటికి భానుమూర్తి కళ్ళు తెరిచాడు. ఆ మనుషుల వైపు యథాస్థితిగా వెర్రిచూపులు చూశాడు.

వసుంధర, నేనూ ఆ మనుషులకి భానుమూర్తి ఆరోగ్యం వివరించాం. ఆ రెండు లక్షల రూపాయలకు పూచీ తనదని వసుంధర ఒప్పుకుంది. కొంత సమయం కావాలని ప్రాధేయపడింది. ఇద్దరం ఆ కాంట్రాక్టర్లకి నచ్చచెప్పేసరికి మా తల ప్రాణం కాలి వ్రేళ్ళకు దిగింది. వాళ్ళను సాగనంపే సరికి చీకటి చిక్కపడింది!

భానుమూర్తి చిత్త చాంచల్యానికి దారాలేవో ఆధారాలేవో నాకు దొరికినట్టనిపించాయి.

మర్నాడు, మరో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ఒకడు, ఆ సంస్థలో ఉద్యోగం నిమిత్తం,

లక్షరూపాయలు ఇచ్చాడు. మరొకడు స్టేషనరీ ఫైలు కదలడానికి భానుమూర్తికి ఏభై వేలు సమర్పించుకున్నాడు. ఆ మరొకడు, నాలుగవ తరగతి ఉద్యోగుల నాయకుడు. వాళ్ళ తాత్కాలిక ఉద్యోగాలు ఖాయం చేసేందుకు ఉమ్మడి సొమ్ము మూడు లక్షల వరకు అందచేశాడు. ఇలా రోజూ, ఒకరి తర్వాత ఒకరు, ఎవరో రావడం.... గోడు చెప్పుకోవడం... గోల పెట్టడం.. భానుమూర్తిని నీచంగా తిట్టడం... ఆ డబ్బులు రాబట్టుకోవడానికి, నానాయాగీ చేయడం.

భానుమూర్తి, ఈ డబ్బంతా ఏం చేశాడు?ఏ బ్యాంకు ఖాతాల్లో, లాకర్లలో దాచాడు? ఈ అక్రమ సంపాదన ఎవరికోసం చేశాడు. ఎందుకోసం చేశాడు? అన్నీ ప్రశ్నలే. వాడు మామూలు మనిషి అయితే తప్ప.. ఈప్రశ్నలకు సమాధానాలు దొరకవు.... వసుంధర, వచ్చిన వాళ్ళందరికీ నచ్చచెప్పి నెల రోజులు గడువు ఇమ్మని కోరింది. ఒక రోజు భానుమూర్తి బ్రీఫ్‌కేసు తెరిచి, వాడిడైరీ ఒకటి చేతికి పట్టుకున్నాం... అందులో కావసిన సమాచారం ఏదీ దొరకలేదు గానీ ఉత్తరం ఒకటి మాకంట పడింది. అందులో సారాంశం ఇలా ఉంది! డియర్ భానుమూర్తి!

నీ పాపం పండింది. నీ అవినీతి భాగోతాల చిట్టా ఒకటి తయారుచేశాం. నీవు కటకటాల జైలు, కళ్ళ చూసే రోజు దగ్గర పడుతోంది. ఎవరి దగ్గర ఎంతెంత పుచ్చుకున్నావో.. వివరాలు కాపీలు తీయించాం... ఆ కాపీలు సిబిసిఐడి వారికి నేరుగా పంపిస్తున్నాం... సాక్ష్యాధారాలతో సిద్ధంగా ఉన్నాం. అతి త్వరలోనే... ఆరోజు కోసం ఎదురు చూడు.... ఉంటా.. ఇట్లు నీ ఆత్మీయ శత్రువు ఆకాశరామన్న"

భానుమూర్తికి పిచ్చి ఎందుకు పట్టిందో నాకిప్పుడు పూర్తిగా అర్థమయింది. అంతులేని అపరాధ భావం... సామాజిక పరమైన వెరపు... తను జైలుకెళ్తాడు, భార్యా బిడ్డలకు దూరమవుతాడు... తన కుటుంబ పరువు పోతుంది... అందరూ ఛీ కొడతారు... అసహ్యించుకుంటారు. బంధువుల్లో ... స్నేహితుల్లో దారుణమైన అవమానం... సిగ్గు... చేసిన నేరానికి శిక్ష అనుభవించాలన్న పిచ్చి భయం... పర్యవసానం... మానసిక వైకల్యం....

భానుమూర్తి మీద నాకు జాలి కలగడం లేదు.

మరో మూడు రోజులు పిచ్చిగా గడిచి పోయాయి...!

నాలుగవ రోజు భానుమూర్తి ముందు ఒక్కడ్నే సాలోచనగా ఆవేదనగా కూర్చున్నాను. వాడు మంచం మీద... ఏదో లోకంలో ఉన్నట్టుగా అలాగే పడుకుని ఉన్నాడు. ఆ చూపుల్లో ఏ మార్పులేదు. అవే వెర్రి చూపులు.. ఉన్నట్టుండి, హఠాత్తుగా మంచం మీదపడుకున్న వాడిలో, ఏదో కదలిక.... చూపుల్లో తేడా... కనుగుడ్లు అటూ ఇటూ కదిలాయి. గది అన్నివైపులా దృష్టిని సారించినట్టుగా. మథన పడుతూ, మంచం ప్రక్కనే కూర్చున్న నా చేయిని గబుక్కున పట్టుకున్నాడు.

"ఒరే ! సత్యం ! నన్ను క్షమించరా! నేను చాలా తప్పులు చేశాను.... నువ్వే రక్షించాలి.

మొదట్లో భయపడి, పిచ్చిగా కేకలు పెట్టడం నిజమే కాని, ఇప్పుడు కావాలనే కేకలు పెడుతున్నాను.... నా కేమీ పిచ్చిలేదురా.. పిచ్చివాడిగా నటిస్తున్నానంతే... ! నాకంతా తెలుస్తోందిరా... ఒరేయ్ సత్యం! కొంతకాలం పిచ్చివాడిగానే ఉంటాను అలా... ఉండాలి. ఓ ఆర్నెల్ల సిక్‌లీవు తీసుకుని, ఆఫీసుకు పంపించరా ! మరో ఊరు బదిలీ అయ్యేలా చూడరా! సమస్యలు అవే సర్దుకుంటాయి. ఈ సాయం చేసిపెట్టు! ప్లీజ్!"

భానుమూర్తి నాకు మాత్రమే వినబడేటట్లుగా హీన స్వరంతో అని... ఎవరో వస్తోన్న అలికిడి విని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

నేను నిశ్చేతనగా ఉండి పోయాను!

భానుమూర్తికి పిచ్చిలేదు.... పిచ్చివాడుగా నటిస్తున్నాడంతే! ఎంత చిత్రం ఎంత విచిత్రం...? ఎందుకో, భానుమూర్తి ముఖచిత్రం, చిత్రాతిచిత్రంగా... చీకటి రంగులు పులుముకుంటూ... వికృతంగా కనపడుతూంది. ఉపాధ్యాయుడిగా, చిత్రకారునిగా నేను చాలా చిత్రాలు గీశాను. వృత్తి పరంగా పిల్లలకు చాలా చిత్రాలు నేర్పించాను. భానుమూర్తి లాంటి 'మనిషి చిత్రం' మాత్రం నేను గీయలేదు.

నేను తిన్నగా వసుంధర గదిలోకి వెళ్ళాను. నాలో ఏదో ఆవేశం... ఆక్రోశం....! "అమ్మా ! వసుంధరా! నీ భర్త భానుమూర్తికి ఏమీ భయంలేదు. వాడికి ఏ రోగమూలేదు. నువ్వు నిశ్చింతగా ఉండు."

నా మాటలకు వసుంధర నర్మగర్భంగా నవ్వింది. ఒక స్థితప్రజ్ఞురాలిలా చూసింది... ఆ చూపులో, నవ్వులో... ఎన్నోభావాలు...!

ఆయన అవినీతి రోగం ఏంవిటో, ఆ సంపాదన ఎంతుందో, ఎక్కడుందో వాటికి పరిష్కారం ఏంవిటో... నాకు అంతా తెలుసు అన్నయ్యగారూ అన్నట్టు అనిపించింది. సిబిసిఐడి వాళ్ళ దాడి ఏమైనా... భర్త తనచేయి దాటిపోతున్నాడన్న భయం, ఆలోచనలపర్యవసానమే ఆకాశరామన్న ఉత్తరమా? ఫోనులో హెచ్చరించడమూనా...? అని కూడా అనిపించింది...

అదే నిజమయితే... భర్తని సంస్కరించుకునే దిశగా, ఆమె వేసే అడుగులో.... ఒక నీతి, ఒక నిజాయితీ, ఒక నిర్భీతి, ఒక స్వచ్ఛత, నాకు స్పష్టంగా, కనిపిస్తున్నాయి...!

❀ ❀ ❀ ❀ ❀ ❀

("నవ్య", దీపావళి ప్రత్యేక సంచిక 2009)